www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 20 ఫిబ్రవరి 2025
5
అన్నమయ్య



కెనరా బ్యాంక్ ఉద్యోగులు ఇంటింటా ప్రచారం

ప్రజాశక్తి-పీలేరు

కెనరా బ్యాంక్ తమ ఖాతా దారులకు అందిస్తున్న వివిధ రకాల సేవలు, పథకాల గురించి ప్రజలకు వివరించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం పీలేరు కెనరా బ్యాంక్ శాఖ మేనేజర్, ఉద్యోగులు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ కెనరా బ్యాంక్ సేవల గురించి ప్రజలకు క్షుణ్ణంగా వివరించే ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మేనేజర్ ఎన్.హరిప్రసాద్, పి.అశోక్ కుమార్, ప్రాంతీయ కార్యాలయం నుంచి సందీప్, సర్కిల్ కార్యాలయం నుంచి శివలలిత, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



పీలేరులో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఉద్యోగులు

ఇరిగేషన్ ఎస్ఇకి సెగ!

- చెప్పింది చెయ్..లేకపోతే సెలవుపై వెళ్లిపో..
- జిల్లాకు చెందిన అధికార పార్టీ నాయకుడి ఒత్తిడి
- తెరవెనక ఓ సీనియర్ ఇంజినీరింగ్ అధికారి?!

ప్రజాశక్తి – కడప ప్రతినిధి

జిల్లా నీటిపారుదల శాఖలో ఇంటిపోరు నడుస్తోంది. జిల్లా నీటిపారుదల శాఖలో పెద్దఎత్తున బదిలీలు జరిగిన సంగతి తెలిసిందే. ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా అనంతపురం జిల్లా నుంచి ఓ సీనియర్ ఇంజినీరింగ్ అధికారి బదిలీపై వచ్చిన సంగతి తెలిసిందే. జిల్లాకు చెందిన ఓ ఇంజినీరింగ్ అధికారి ఇటీవల వరకు ఐదు పోస్టులను నిర్వహిస్తున్నారు. ఇటీవల బదిలీల్లో భాగంగా ఆయన పరిధిలోని ఐదు స్థానాలకు ఐదుగురు ఇంజినీరింగ్ అధికారులు రావడానికి సిద్ధపడినట్లు సమాచారం. ఆయన పరిధిలోని ఐదు పోస్టుల్లో ఓ సూపరింటెండెంట్ స్థాయి పోస్టును కోల్పోయారు. సదరు ఇంజినీరింగ్ అధికారి సర్కిల్ సూపరింటెండెంట్ పోస్టును టార్గెట్ చేసినట్లు ఇరిగేషన్ ఇంజినీరింగ్ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. ఆయన తనకు కొన్నేళ్ల నుంచి పరిచయం కలిగిన రాజకీయ నాయకుల దగ్గరికి వెళ్లి తిరుగులేని చెప్పడం, చేయకూడని పనులు చేయాలని ఒత్తిడి చేయాలని వెర్రెపుతున్నారనే వాదన వినిపిస్తోంది. పనులు చేయనిపక్షంలో సెలవుపై వెళ్లిపోవాలని జిల్లాకు చెందిన అధికార పార్టీకి చెందిన రాజకీయ నాయకుల చేత హుకుంలు జారీ చేయిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఏమి చేయాలో తెలియని సర్కిల్ ఎస్ఇ దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నట్లు సమాచారం. ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఇని సెలవుపై వెళ్లే ఆయన స్థానాన్ని దక్కించుకోవాలనే ఉద్దేశంతో పావులు కదుపుతున్నారనే విమర్శ వినిపిస్తోంది. ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండెంట్‌పై ఆయనకుంటే తక్కువ స్థాయి కలిగిన ఇంజినీరింగ్ అధికారి ఇటువంటి ప్రైవేట్ చేస్తుండడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.



కడప ఇరిగేషన్ ఎస్ఇ కార్యాలయం

'ముదివేడు' బాధితులను ఆదుకోండి : సిపిఎం

ప్రజాశక్తి-మదనపల్లి అర్బన్

ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ భూ నిర్వాసితులను ఆదుకోవాలని కోరుతూ సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద రెవెన్యూ చీఫ్ సెక్రెటరీ సిసోడియాను కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురబలకోట మండలం, పిచ్చలవాండ్లపల్లి గ్రామం లోని పిచ్చలవారిపల్లి, సీతివారిపల్లి, కొత్తపల్లి, బి.కొత్తకోట మండలం కోటావూరు గ్రామ చౌటకుంటపల్లి, దిన్నె మీదపల్లి గ్రామాల్లో సుమారు 300 మంది రైతులు 780 ఎకరాల భూమిని ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కోసం కోల్పోయారని అన్నారు. వ్యవసాయం చేసుకుంటూ ఏడాదికి రెండు, మూడు పంటలు పండించుకుంటూ వచ్చే ఫలసాయంతో రైతులు తమ కుటుంబాలను పోషించుకునే వారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతుల ఆమోదం లేకుండా ఏకపక్షంగా వారి భూములు బలవంతంగా తీసుకుని 2021లో ముదివేడు బాలన్సింగ్ రిజర్వాయర్ పనులు ప్రారంభించారన్నారు. తమ భూములు తీసుకోవద్దని అధికారులు చుట్టూ తిరిగితే అందరికంటే ఎక్కువ పరిహారం ఇస్తామని, అప్పటి వరకు ఎకరాకు రూ.45వేలు లీజు ఇస్తామని చెప్పిన అధికారులు, నిరసన తెలియజేయడానికి కూడా అవకాశం ఇవ్వకుండా, పోలీసులతో రైతులను నిర్బంధించి దౌర్జన్యంగా పనులు ప్రారంభించారని తెలిపారు. వ్యవసాయం చేసుకుంటూ ఏడాదికి రూ.5 నుంచి రూ.10 లక్షల వరకు ఫలసాయం పొందుతున్న రైతులు భూములు కోల్పోయి దిక్కుతోచని స్థితిలో పరిహారం ఇవ్వాలని, పునరావాసం కల్పించాలని కోరుతూ రెండు మూడు రోజులు శాంతియుతంగా, సామరస్యంగా నిరసన తెలిపినా, పోలీసులతో వచ్చి బెదిరించి రైతులను నిర్బంధించి రిజర్వాయర్ పనులు కొనసాగించారని అన్నారు. కొంతమందికి మాత్రమే ఏడాది లీజు చెల్లించి, మిగతా రైతులకు ఇప్పటికీ ఒక్క రూపాయి పరిహారం చెల్లించకపోగా పునరావాసం కల్పించలేదన్నారు. ఒక వైపు ప్రాజెక్టుకు భూములు కోల్పోయి పనులు లేక, మరోపక్క ప్రభుత్వ పరిహారం అందక కుటుంబాలు పస్తులతో జీవిస్తున్నారని, పిల్లలను చదివించుకోలేని దుస్థితిలో ఉన్నారని వాపోయారు. భూములు లేని కూలీల పరిస్థితి మరీ దుర్భరంగా మారిందని, ఈ విషయం ప్రభుత్వ అధికారులకు విన్నవించినా కనీసం పట్టించుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన రైతులకు, వెంటనే 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూమికి భూమి ఇచ్చి, పరిహారం ఇవ్వాలని, పునర్నిర్మాణం పునరావాస కల్పించాలని కోరారు. గత మూడేళ్లుగా లీజు చెల్లించలేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా లీజు పెంచి బకాయిలను చెల్లించాలని కోరారు. భూమి లేని వ్యవసాయ కూలీలకు 2013 భూ సేకరణ చట్టం మేరకు పరిహారం ఇవ్వాలని కోరారు. ఈ విషయమై ఇదివరకే అనేక మార్లు కలెక్టర్, కమిషనర్, పునరావాస, పునస్థాపన, స్పెషల్ చీఫ్ సెక్రటరీ, రెవెన్యూ విభాగం అధికారులకు విన్నవించినట్లు తెలిపారు. రైతులకు ఇవ్వాల్సిన పరిహారం సిఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లించుటకు వివరాలు నమోదు చేశారని, ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు అయిన వెంటనే తగు చర్యలు తీసుకుంటామని హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎండార్స్‌మెంట్ ఇచ్చారని తెలిపారు. ఇప్పటికైనా స్పందించి ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు.

ఫైళ్ల దగ్ధంపై లోతుగా విచారణ సాగుతోంది

సబ్ కలెక్టర్ కార్యాలయం పునఃప్రారంభోత్సవంలో ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి సిసోడియా

ప్రజాశక్తి-మదనపల్లి అర్బన్

మదనపల్లిలో పునరుద్ధరించిన జడిన సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి (రెవెన్యూ) ఆర్‌పి సిసోడియా బుధవారం ప్రారంభించారు. సిసోడియాకు కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిసోడియా మీడియాతో మాట్లాడుతూ గత సంవత్సరం జూలైలో అగ్ని ప్రమాదం సంభవించి సబ్ కలెక్టర్ కార్యాలయం దగ్ధమైన సంఘటన అందరికీ తెలిసినదేనన్నారు. సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ చొరవ తీసుకుని తిరిగి కార్యాలయాన్ని పునరుద్ధరించడంతో మళ్లీ ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అగ్ని ప్రమాదంలో దాదాపు 2,400 దస్త్రాలు దగ్ధం కాగా తిరిగి వాటిని పూర్తి స్థాయిలో సేకరించినట్లు తెలిపారు. ప్రమాదంపై పూర్తిస్థాయిలో లోతుగా దర్యాప్తు జరుగుతోందని పేర్కొన్నారు. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరు ఆర్డిఒలు, కొంత మంది సిబ్బందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. అగ్ని ప్రమాదం జరిగిన తర్వాత తాను మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించిన సమయంలో ప్రజల వద్ద నుంచి 484 అర్జీలను స్వయంగా తీసుకున్నానని, వాటిలో దాదాపు 80 శాతం పూర్తయ్యాయని మిగతా అర్జీలను త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. డిప్యూటీ తహశీల్దార్ కొరత, తహశీల్దార్ నియామకం పై మాట్లాడుతూ డైరెక్ట్ రిక్రూట్మెంట్ ద్వారా డిప్యూటీ తహశీల్దార్లను త్వరలోనే నియమించడం జరుగుతుందని చెప్పారు. ప్రమోషన్ విషయంపై, హైకోర్టులో కేసు జరుగుతోందని, త్వరలోనే కేసు పరిష్కారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన అర్జీదారుల నుండి పలు అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ కలెక్టర్ కార్యాలయాన్ని పునరుద్ధరించి మళ్లీ ప్రారంభించడానికి వచ్చిన సిసోడియాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని తిరిగి ప్రారంభించుకోవడం శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, వివిధ మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సిసోడియా

సబ్ కలెక్టర్ కార్యాలయానికి ఐఎస్ఒ సర్టిఫికెట్ : మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయం ఐఎస్ఓ 9001:2015 సర్టిఫికెట్‌ను అందుకుంది. రెవెన్యూ సాధారణ పరిపాలన, విపత్తు నిర్వహణ తదితర పాలనా విషయాలకు సంబంధించి, ఐఎస్ఒ ప్రమాణాలను అనుసరిస్తూ, నాణ్యతతో కూడిన సేవలను ప్రజలకు అందించడాన్ని హైదరాబాదుకు చెందిన గ్లోబల్ మేనేజ్మెంట్ సర్టిఫికెట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ గుర్తిస్తూ మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయానికి 17న, ఐఎస్ఒసర్టిఫికెట్‌ను అందించింది. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించడానికి మదనపల్లికు విచ్చేసిన ఆర్‌పి సిసోడియాకు కలెక్టర్ శ్రీధర్ చామకూరి, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయం అందుకున్న ప్రతిష్టాత్మక ఐఎస్ఓ ఫోటో ఫ్రేమును అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌లను ఆర్‌పి సిసోడియా, ప్రత్యేకంగా అభినందించారు.

ఆప్కాస్ రద్దు నిర్ణయం విరమించుకోవాలి : సిఐటియు



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పొరుగు సేవల కార్మికుల కోసం గత వైసిపి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆప్కాస్ సంస్థను రద్దు చేయాలని కూటమి ప్రభుత్వ మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ పేర్కొన్నారు. బుధవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆప్కాస్ సంస్థను రద్దు పరచి ఆ స్థానంలో ప్రయివేట్ ఏజెన్సీలను ప్రవేశపెడతామని నిర్ణయించడంతో ఆప్కాస్‌లో ఉన్న పొరుగు సేవల కార్మికులందరిలోనూ తీవ్ర భయాందోళన నెలకొందని అన్నారు. ఆప్కాస్ ను రద్దు చేస్తే తిరిగి దళారీ వ్యవస్థ రంగంలోకి వస్తుందని, ఉద్యోగాలకు భద్రత లేకుండా పోయే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. పొరుగు సేవల కార్మికుల్లో నెలకొన్న భయాందోళనలను తొలగించి ఉద్యోగ భద్రత, భరోసా కల్పించే విధంగా కూటమి ప్రభుత్వం స్పందించాలన్నారు. ఆప్కాస్ ఏర్పాటు కాకముందు మున్సిపాలిటీ రంగంలో ప్రతి సెక్షన్‌కి దళారీ వ్యవస్థ కొనసాగేదని, జీత భత్యాల చెల్లింపు దళారీల దయా దాక్షిణ్యాల మీద ఆధారపడి ఉండేదన్నారు. ప్రతి నెల జీతాలు చెల్లించేవారు కాదని, ఐదు నుండి ఆరు నెలలు జీతాలు బకాయిలు పెట్టేవారని తెలిపారు. జీతాలలో కూడా పెద్ద ఎత్తున కోతలు విధించి కార్మికులను దగా చేసేవారని, కార్మికుల బ్యాంకు పాస్ పుస్తకాలు కూడా ప్రయివేట్ ఏజెన్సీ నిర్వాహకుల దగ్గరే పెట్టుకుని కార్మికులను వేధించేవారని ఆరోపించారు. ఆప్కాస్ వ్యవస్థ ఏర్పాటు వల్ల వీటన్నిటికీ చెల్లు చీటీ జరిగిందని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం దళారీ వ్యవస్థను రద్దుచేసి ఉద్యోగాలు పర్మనెంట్ చేస్తామన్న హామీని కార్మికులందరూ నమ్మారు కానీ వైసిపి ప్రభుత్వం ఉద్యోగాలు పర్మనెంట్ చెయ్యలేదని, దళారీ వ్యవస్థ స్థానంలో ప్రభుత్వమే మధ్యవర్తి పాత్ర పోషించే ఆప్కాస్ వ్యవస్థను తెచ్చిపెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దుచేసి ఒప్పంద కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తుందని కార్మికులు వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నారని అన్నారు. కానీ ఈనెల 6న జరిగిన మంత్రివర్గ సమావేశం అందుకు భరోసా ఇవ్వకపోగా ఆప్కాస్ సంస్థను రద్దుచేసి తిరిగి దళారీ వ్యవస్థను తెచ్చిపెడుతుందనే ప్రచారం జరగటం తీవ్ర విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, శాశ్వత స్వభావం కలిగిన విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య, ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన ఒప్పంద కార్మికులను పర్మినెంట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగాలు పర్మినెంట్ చేసే దిశగా కాకుండా దళారీ వ్యవస్థను తెచ్చిపెట్టేటట్లయితే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమణ, లక్ష్మీదేవి, ప్రసాద్, ఓబయ్య, రవిశంకర్, సురేష్, సుశీల పాల్గొన్నారు.

'జిబిఎస్' పట్ల అప్రమత్తంగా ఉండాలి

-ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఓ డాక్టర్ జి.ఉషశ్రీ

ప్రజాశక్తి-రాయచోటి టౌన్



గులియన్ బారి సింద్రోమ్ ఒక రకమైన నాడీ సంబంధిత వ్యాధి అని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఓ డాక్టర్ జి.ఉషశ్రీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గులియన్ బారి సింద్రోమ్ వ్యాధి శరీరంలో రోగ నిరోధక శక్తి తగ్గి నరాలపై దాడి చేయడం వల్ల ఈ వ్యాధి సంభవిస్తుందని అన్నారు. ఈ వ్యాధి సోకిన వారికి చేతులు బలహీనపడడం, చలనం తగ్గిపోవడం జరుగుతుందని పేర్కొన్నారు. కొన్నిసార్లు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు కలుగుతాయని ఈ వ్యాధి కొన్ని బ్యాక్టీరియా, వైరస్ ద్వారా సంక్ర మిస్తుందని తెలిపారు. కలుషితమైన ఆహారం, నీరు తాగడం వలన ఈ వ్యాధి సోకే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. కాళ్ల నుండి చేతులకు తిమ్మిర్లు వ్యాపించడం, తీవ్రమైన నరాల నొప్పి, నిలబడడం నడవడం కష్టంగా ఉండడం వ్యాధి లక్షణాలని తెలిపారు. ప్లాస్మా ఎక్స్ఛేంజ్ థెరపీ, ఇమినో గ్లోబిన్ థెరపీ వంటి పద్ధతులు ఉపయోగించి ప్రాథమిక దశలోనే గుర్తిస్తే ఈ వ్యాధి ప్రభా వాన్ని తగ్గించవచ్చని అన్నారు. మొదటి లక్షణాలు కల్పించిన వెంటనే వైద్య పరీక్ష చేసుకోవాలని, చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకుంటూ కాచి చల్లార్చిన నీరు తాగడం ద్వారా ఈ వ్యాధిని అరికట్టవచ్చని అన్నారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే దగ్గరలో ఉన్న వైద్య సిబ్బందిని సంప్రదించి తెలియజేయాలని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముత్తుకుమార్

'మిట్స్'లో సుస్థిర కెరీర్ ఎంపికలపై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో సుస్థిరమైన ఇంధన ఎంపికలు, కెరీర్ ఎంపికలు పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ పి. ముత్తు కుమార్ పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూపర్యావరణ అనుకూల భవిష్యత్తును రూపొందించడంలో సౌర, పవన, బయో ఎనర్జీ వంటి పునరుత్పాదక ఇంధన వనరుల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఇంధన రంగం లో అభివృద్ధి చెందుతున్న కెరీర్ అవకాశాలపై అవగాహన కల్పించారు. అభివృద్ధి చెందుతున్న డొమైన్‌లో రాణించడానికి అవసరమైన నైపుణ్యాలపై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. వైస్ ప్రిన్సి పల్ డాక్టర్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామనాథన్, డీన్ డాక్టర్ తులసీరామ్ నాయుడు పాల్గొన్నారు.

'ఫ్యూచర్ మైండ్స్'లో ఘనంగా ఫ్లవర్స్‌డే

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

స్థానిక ఫ్యూచర్ మైండ్స్ స్కూల్‌లో కరస్పాండెంట్ నంద కిషోర్ ఆధ్వర్యంలో ప్రీ ప్రైమరీ విద్యార్థులచే ఫ్లవర్స్‌డే ఘనంగా నిర్వహించారు. బాలికలు పూలతో అందంగా అలంకరించుకుని చూపరులను ఆకట్టుకున్నారు. ఇటువంటి కార్యక్రమాలు ద్వారా పిల్లలలో ఒత్తిడి తగ్గి చదువులో మరింత చురుకుగా తయారవుతారని, అందుకే తమ పాఠశాలలో ప్రతి రెండు నెలలకు ఒకసారి ఒక సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించి విద్యార్థులను ఉత్సాహపరుస్తుంటామని కరస్పాండెంట్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వాతి, ఉమ, తేజ, షాహిన్, స్రవంతి, మెహతాబ్, కావ్య, భాగ్య, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పూలతో అలంకరించుకున్న బాలికలు

నిర్ణీత ధరలకే సరుకులు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-కలికిరి



మాట్లాడుతున్న సిఎస్‌డిటి విజయకుమార్‌రెడ్డి

నిర్ణీత ధరలకే ఎండియూ ఆపరే టర్లు కార్డు దారులకు సరుకులు పంపిణీ చేయాలని మండల సిఎస్‌డిటి విజయకుమార్‌రెడ్డి సూచించారు. గురువారం స్థానిక మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో డీలర్లకు సమావేశం ఏర్పాటు చేసి ఎండియు ఆపరేటర్లు రేషన్ కార్డుదారులతో ఆప్యాయంగా, మర్యాదపర్వకంగా మాట్లాడి రేషన్ సరుకులు పంపిణీ చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలలో మాత్రమే ధరలకే లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేయాలని, అలా నిర్ణీత ధరలకు మించి అమ్మితే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. రేషన్ డీలర్లు ఎండియు ఆపరేటర్లు సమయపాలనలో సరుకులు పంపిణీ చేయాలని రేషన్ డీలర్లను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో సిఎస్‌డిటి విజయ్ కుమార్‌రెడ్డి, రేషన్ డీలర్లు, ఎండియు ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన ప్రదేశాన్ని కలుషితం చేయొద్దు

ప్రజాశక్తి-పీలేరు : పట్టణంలో ఆరోగ్యకరమైన ప్రదేశాల్ని మద్యం దుకాణం ఏర్పాటు చేసి కలుషితం చేస్తే సహించేది లేదని స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించారు. పీలేరు పట్టణంలోని వివేకానంద సర్కిల్ (కోటపల్లి క్రాస్)లో బయటి వ్యక్తులు వచ్చి ఇక్కడ మద్యం షాపు ఏర్పాటుచేసి నిర్వహించాలని చూస్తుండగా స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివేకానంద సర్కిల్ చుట్టూ విద్యాసంస్థలు ఉన్నాయని, సుమారు రెండు వేల మందికి పైగావిద్యార్థులు తరచూ పాఠశాలలకు రాకపోకలు సాగిస్తుంటారని అన్నారు. మద్యం సేవించిన ఆకతాయిలు రోడ్లమీద పడడం, ఇబ్బంది పెట్టడం లాంటి పరిస్థితులు ఎదురయ్యే ప్రమాదముందన్న ఆవేదనను వ్యక్తం చేశారు. ఇక్కడ లిక్కర్ షాపు నిర్వహించడం తగదని సూచించారు.



మద్యంషాపు ఏర్పాటు వద్దని ధర్నా చేస్తున్న స్థానికులు



ఆస్పత్రికి మంచాలు, పరుపులు, స్టూళ్లు వితరణ చేస్తున్న దాత రాజారెడ్డి

దాతృత్వం చాటుకున్న విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి రూ.1.40 లక్షలు విలువ చేసే సామగ్రి అందించి ఓ విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయుడు తన దాతృత్వాన్ని చాటుకున్నాడు. మండలంలోని రేగళ్ళు గ్రామం, కూరపర్తివారిపల్లికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బద్దల రాజారెడ్డి తన తల్లిదండ్రులైన బద్దల సిద్దమ్మ, నాగిరెడ్డిల జ్ఞాపకార్థం బుధవారం పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలకు రూ.1.40లక్షలు విలువైన 12 మంచాలు,12 బెడ్లు, 12 దిండ్లు, 12 స్టూళ్లను విరాళంగా అందించారు. ఈ ఉదార సేవా కార్యక్రమం ద్వారా ఆయన తన తల్లిదండ్రుల పట్ల తనకున్న ప్రేమను, సమాజం పట్ల తనకున్న బాధ్యతను వితరణ కార్యక్రమం ద్వారా చాటిచెప్పారు. సమాజ హితం కోరి తన సంపాదనలో కొంత భాగాన్ని ఈ విధంగా సేవా కార్యక్రమాలకు వినియోగించడం తన దాతృత్వానికి నిదర్శనమని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు వగళ్ళ చంద్రారెడ్డి కొనియాడారు. రోగులు, వారిని సంరక్షించే వైద్యులు, వైద్య సిబ్బందికి మరింత సౌకర్యం సమకూర్చడం సంతోషించేదగ్గ విషయమని అన్నారు. తన విరాళంతో ప్రజా ఆరోగ్యానికి సేవ చేసిన గొప్ప వ్యక్తి రాజారెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు వగళ్ళ చంద్రారెడ్డితో పాటు సభ్యులు నరసింహారెడ్డి, ఆంజనేయులు, కృష్ణయ్య, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.చంద్రశేఖర్, ఆర్ఎంఓ డాక్టర్ సరస్వతమ్మ, ఇతర వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరు మండల సర్వేయర్‌గా కీర్తన

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు మండల సర్వేయర్‌గా కీర్తన బాధ్యతలు చేపట్టారు. బుధవారం ఆమె స్థానిక తహశీల్దారు భీమేశ్వరరావును కలిసి రిపోర్టు చేశారు. ఇక్కడ సర్వేయర్‌గా పనిచేసిన కిరణ్మయి పీలేరు నియోజకవర్గం పరిధిలోని గుర్రంకొండ మండలానికి బదిలీ అయ్యారు. ఆ స్థానంలో కెవి.పల్లి మండలంలో సర్వేయర్ గా పనిచేస్తూ బదిలీపై వచ్చిన కీర్తన తహశీల్దారును కలిసి జాయినింగ్ రిపోర్ట్ అందజేసి బాధ్యతలు తీసుకున్నారు.



తహశీల్దార్‌కు జాయినింగ్ రిపోర్టు ఇస్తున్న సర్వేయర్ కీర్తన

23 నుంచి శ్రీవీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు



మాట్లాడుతున్న తహశీల్దార్ నరసింహ కుమార్

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని శ్రీభద్రకాళీ సమేత శ్రీవీరభద్ర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని తహశీల్దార్ నరసింహ కుమార్ పేర్కొన్నారు. బుధవారం వీరభద్ర స్వామి ఆలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ నెల 23 నుండి మార్చి 5 వరకు జరగబోయే శ్రీ భద్రకాళి సమేత శ్రీవీరభద్ర స్వామి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆలయ ఇఒ రమణారెడ్డి అధ్యక్షతన దేవాదాయ శాఖ పోలీస్ అధికారులు, రెవెన్యూ, అగ్నిమాపక, వైద్య ఆరోగ్యశాఖ, విద్యుత్ శాఖ, మున్సిపల్ ,ప్రజా రవాణా శాఖ రహదారులు , భవనాల శాఖ ఎక్సైజ్ శాఖ విద్యాశాఖ తదితర అధికారులతో సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహ కుమార్ మాట్లాడుతూ శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలన్నారు. బ్రహ్మోత్సవాలకు మంది భక్తులు రానున్న నేపథ్యంలో భక్తులకు ఉచిత దర్శనం, వసతి గదుల ఏర్పాటు, అన్నదానము, తాగునీటి కల్పన, తదితర అంశాలలో ఆలయ ఈవో, వివిధ శాఖల జిల్లా అధికారులతో సమన్వయం చేసుకొని పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. బ్రహ్మోత్సవాలు సజావుగా జరగడానికి కీలకపాత్ర పోషించనున్న పోలీసు శాఖ వారు కట్టుదిట్టమైన క్యూలైన్లను ఏర్పాటు చేసి పకడ్బందీగా బందోబస్తు నిర్వహించాలన్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో నిరంతరం విద్యుత్ సరఫరా జరగాలని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని పేర్కొన్నారు. పోలీస్ శాఖ, రహదారులు, భవనాల శాఖ, విద్యుత్ శాఖలు సమన్వయంతో రథోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా హెల్త్ క్యాంపులను ఏర్పాటు చేయాలిన్నారు. బ్రహ్మోత్సవాల వేడుకల నిర్వహణలో ఎటువంటి అలసత్వం ఉండరాదని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ డిఇఒ శివ ప్రకాష్‌రెడ్డి, ట్రాఫిక్ సిఐ విశ్వనాథరెడ్డి, ఫైర్ ఆఫీసర్ వెంకటరామిరెడ్డి, ఎస్ఐ నరసింహారెడ్డి, హెల్త్ సూపర్వైజర్ నూర్జహాన్, ఎఎన్ఎం పద్మావతి, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



బి.కొత్తకోట : ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత స్వయం ఉపాధి కల్పన కోసం బిసి, ఇబిసి, ఇడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ల ద్వారా 50 శాతం సబ్సిడీతో అందిస్తున్న రుణాలకు బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో నిమ్మనపల్లి ఇండియన్ బ్యాంక్ మేనేజర్ చంద్రయ్య, నిమ్మనపల్లె సప్తగిరి గ్రామీణ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ కె.రామాంజులుతో కలిసి ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి, ఇఒపిఆర్‌డి చలపతిరావు ఇంటర్వ్యూలను నిర్వహించారు. మండల వ్యాప్తంగా 315 మంది సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోగా, 219 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు తెలిపారు. **వీరబల్లి:** మండలంలోని 12 గ్రామాల పంచాయతీల నుంచి 286 మంది బిసి, ఒసి రుణాలకు దరఖాస్తు చేసుకోగా 221 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపిడిఒ నూర్జహాన్ తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి పాల్గొని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా బిసి, ఒసి, సబ్సిడీ రుణాలకు 32 యూనిట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. అందులో ఎపిజిబి వీరబల్లి బ్యాంకుకు 18 యూనిట్లు, యూనియన్ బ్యాంక్ సానిపాయి బ్యాంకుకు 3 యూనిట్లు, ఎపిజిబి రాయచోటి బ్యాంకుకు 4 యూనిట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా వీరబల్లి బ్యాంకుకు 4 యూనిట్లు, ఎస్‌బిఐ గడికోట బ్యాంకుకు 3 యూనిట్లు మంజూరు అయినట్లు తెలిపారు. ఓసి అప్లికేషన్లు 37, బిసి అప్లికేషన్లు 184 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. **బి.కొత్తకోట :** నగర పంచాయతీ వ్యాప్తంగా బిసి,కాపు సబ్సిడీ రుణాలకు 34 యూనిట్లు మంజురయ్యాయని కమిషనర్ జీ.వి.పల్లవి తెలిపారు. అందులో ఎనిమిది యూనిట్లు కాపులకు, బిసిలకు 26 యూనిట్లు కేటాయించారన్నారు. 293 మంది దరఖాస్తు చేసుకోగా,173 హాజరయ్యారన్నారు. **పుల్లంపేట :** మండల వ్యాప్తంగా బిసి రుణాలకు 239 మంది దరఖాస్తు చేసుకోగా అందులో 150 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎఒ శ్రీధర్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలో గల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మొదలగు మేనేజర్లు పాల్గొన్నట్లు తెలిపారు. **కలకడ:** బిసి కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో 178 మంది అభ్యర్థులు హాజరైనట్లు ఎంపిడిఒ అబ్దుల్ రహీం తెలిపారు. ఎండిపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 344 మంది దరఖాస్తు చేసుకోగా 178 మంది హాజరైనట్లుత తెలిపారు. **పీలేరు:** బిసి రుణాల ఇంటర్వ్యూలకు 408 మంది హాజరయ్యారని పీలేరు ఎంపిడిఒ జి. శివశంకర్ తెలిపారు. మండల పరిధిలోని బ్యాంకర్లు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రుణాల మంజూరుకు అర్హులైన లబ్ధిదారుల ఎంపికలో భాగంగా దరఖాస్తుదారులను పిలిపించి ఇంటర్వ్యూలు చేశారు. పీలేరు మండల పరిధిలో 540 మంది నిరుద్యోగులు ఉపాధి కోసం వివిధ కార్పొరేషన్లకు ఆన్‌లైన్‌లో సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారిలో 408 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని ఎంపిడిఒ చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నాగేంద్ర, జూనియర్ నాయకురాలు శైలజ, సచివాలయాల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా అమర్నాథ్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె



నిమ్మనపల్లి నూతన తహశీల్దార్‌గా కె.అమర్నాథ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల కలెక్టర్ చామకూరి శ్రీధర్ జిల్లాలో కొంత మంది తహశీల్దార్లను డిప్యూ టేషన్‌పై బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా నిమ్మనపల్లిలో పనిచేస్తున్న తహ శీల్దార్ ధనంజయలు మదనపల్లెకు బదిలీ కాగా, నందలూరులో పనిచేస్తున్న కె.అమర్నాథ్ నిమ్మనపల్లె తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ సిరాజుద్దీన్, సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, మండల సర్వేయర్ గోపీనాథ్, విఆర్‌ఒలు, సర్వేయర్లు పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. పలువురు నాయకులు, దళిత సంఘాల నేతలు శుభాకాం క్షలు తెలిపారు. అనం తరం ఆయన విఆర్‌ఒలు, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలోని భూ సమస్యలను పరిష్కరించడానికి రెవెన్యూ రికార్డులను పకడ్బందీగా నిర్వహించడానికి చర్యలు చేపడ తామని అన్నారు. రెవిన్యూ సిబ్బంది చట్ట ప్రకారం తమ విధులను నిర్వహిం చాలని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అంకితభావంతో పనిచేయాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎపిఎం ఖాదర్‌వలీ

పెరటి తోటలతో మెరుగైన ఆరోగ్యం

ప్రజాశక్తి-వీరబల్లి

ఇంటి ఆవరణంలో ఉండే పెరటి తోటల్లో పండించే కూరగాయలతో ఎపియం ఖాదర్ వలి పేర్కొన్నారు. బుధవారం గుర్రాప్పగారిపల్లి గ్రామ సమాఖ్య-2 కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడాతూ మండలంలోని మొదటి విడతలో ప్రతి గ్రామ సమాఖ్య పరిధి నుంచి వంద కుటుంబాలతో పెరటితోటలు, హెూమ్ కంపోస్టు ఏర్పాటు చేయుటకు విఐఎలతో సర్వే జరుగుతోందని అన్నారు. సిసి నాగేంద్ర మాట్లాడుతూ సంఘాలు సమావేశాల్లో అన్ని రకాల లావాదేవీలు జరుపు కోవాలన్నారు. కార్యక్రమంలో సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాల దలవాయిపల్లిలో ఉపాధ్యాయుడు రమణా ఆధ్వర్యంలో ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు శివాజీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ భారతదేశాన మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించి మొఘల సామ్రాజ్యాన్ని ఎదిరించి మరాఠా వీరుడిగా పేరుపొందాడని అన్నారు. **వాల్మీకిపురం:** ఛత్రపతి శివాజి జయంతిని పురస్కరించుకొని పట్టణ ప్రజలు కలసికట్టుగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పురవీధుల్లో ఛత్రపతి శివాజి చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించి, నినాదాలు చేశారు. అనంతరం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రవిచందర్, సాయిభార్గవ్, బొక్కసం రామక్రిష్ణ, ఆనంద, విష్ణు చైతన్య, ఎన్టీఆర్ శీనా, ఫణి, దినేష్, వెంకటేష్, రోహిత్, తిరుమలేష్, నాగేంద్ర పాల్గొన్నారు.

27న వారపు సంతకు వేలం పాట

ప్రజాశక్తి-బి.కొత్తకోట : నగర పంచాయతీ పరిధిలోని వారపు, దినసరి సంతలు, దిగువ బస్టాండుల నిర్వహణ కొరకు 2025-26కుగాను ఈనెల 27న వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ జీ.వి.పల్లవి పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడాది కాలపరమితితో ఈ వేలం పాటలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ వేలంలో పాల్గొన దలచినవారు నగర పంచాయతీ కార్యాలయం, ఆర్ఐ, రెవెన్యూ ఆఫీసర్ కార్యాలయాలను పన్నివేళల్లో సంప్రదించి వారికి అవసరమైన వివరాలను తెలుసుకోవచ్చని సూచించారు.

వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలి : ఎంపిపి

ప్రజాశక్తి-రామాపురం



మాట్లాడుతున్న ఎంపిడిఒ జాషవా

వేసవి దృష్టిలో పెట్టుకొని మండలంలో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపిపి గడికోట విజయలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ సభ భవనంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎంపిడిఒ జాషువా మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన సభ్యులకు వివరించారు. అనంతరం శాఖల పనితీరుపై అధికారులు సభలో సభ్యులకు తెలిపారు. అనంతరం పంచాయతీరాజ్ ఇంజినీర్ జగదీష్ మాట్లాడుతూ మండలంలో సిమెంట్ రోడ్లు మొదటి విడత పూర్తి చేశారని రెండో విడత పనులు మొదలు పెడుతున్నట్లు తెలిపారు. ఎంఇఒ రామకృష్ణుడు మాట్లాడుతూ నీలకంతరావుపేట బాలికల సంక్షేమ హాస్టల్ అభివృద్ధి కోసం రూ.12లక్షలు మంజూరు అయ్యాయని, త్వరలో టెండర్ పిలిచి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వ్యవసాయ అధికారి నాగమణి మాట్లాడుతూ ఈనెల 27 తేదీలోపు ప్రతి రైతు ఇకెవైసి చేయించుకుని రైతు గుర్తింపు కార్డు పొందాలన్నారు. ఈ కార్డు పొందిన వారికి ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు వారికి అందుతాయి అన్నారు. కందులకు మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నామని అన్నారు. ఉలవ, వేరుశనగ పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ బర్డ్ ఫ్లూ వ్యాధిపై సభ్యులకు వివరించారు. ఉద్యానవన శాఖ అధికారి నాగమణి మాట్లాడుతూ మండలానికి మూడు పేక హౌస్లు మంజూరయ్యాయి అన్నారు. ఇందులో 90 శాతం ప్రభుత్వం నుంచి సబ్సిడీ అందిస్తుందని మిగిలిన 10శాతం రైతు వాటా ఉంటుందన్నారు. సస్య రక్షణ పై గ్రామాల్లో ప్రజలకు రైతులకు అవగాహన కల్పించమన్నారు. రామాపురం మండలాన్ని కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటించడంతో ఉపాధి హామీ పథకంలో కూలీలకు 150 పని దినాలు కల్పించిందని ఉపాధి ఇసి శివయ్య తెలి పారు. శాఖల అధికారులు నివేదికలను సభలో వివరించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు రవిశంకర్‌రెడ్డి. తహశీల్దార్ రామాం జనేయులు, ఎంపిడిఒ జాషువా, ఎంఇఒ రామకృష్ణుడు, ఎఒ నాగమణి, ఆయా గ్రామాల సర్పంచులు, మండలశాఖ అధికారులు పాల్గొన్నారు.

అంగన్వాడీల బలోపేతమే లక్ష్యం : సిడిపిఒ



నిమ్మనపల్లి :మాట్లాడుతున్న సిడిపిఒ సుజాత

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

అంగన్వాడీ కేంద్రాల ద్వారా పూర్వ ప్రాథమిక విద్యపై పటిష్ట పునాదులకు ప్రత్యేక చర్యలు చేపట్టి, అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఐసిడిఎస్ మదనపల్లె ప్రాజెక్టు సిడిపిఒ సుజాత అన్నారు. బుధవారం రెడ్డివారిపల్లిలో అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి కార్యక్రమం ద్వారా ఇస్తున్న శిక్షణను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ సాల్ట్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి కార్యక్రమం ద్వారా అంగన్వాడీలకు 120 రోజులపాటు ప్రత్యేక శిక్షణను అందించి, అర్హత కలిగిన వారికి ధ్రువీకరణ పత్రాలను అందించనున్నట్లు తెలిపారు. అందులో మొదట విడత ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు ఆరు రోజులపాటు శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. ఈ శిక్షణలో అంగన్వాడీ టీచర్లు చిన్నపిల్లలకు ఎలా విద్యను బోధించాలి, అంగన్వాడీ కేంద్రాలను ఎలా నిర్వహించాలి, బలోపేతం చేయడానికి ఎటువంటి చర్యలు చేపట్టాలో వివరించారు. నూతన విద్యా విధానాలు ఎలా అమలు చేయాలి, పూర్వ ప్రాథమిక విద్యలో తీసుకోవలసిన జాగ్రత్తలు వంటి అంశాలపై వివరించి చెప్పారు. అంగన్వాడీ కేంద్రంలోని విద్యార్థులు పూర్వ ప్రాథమిక విద్యను సంపూర్ణంగా అభ్యసించి, ప్రాథమిక పాఠశాలలో చదువు పట్ల చురుకుగా వ్యవహరించేలా పునాదులు వేయాలని సూచించారు. ప్రత్యేకంగా శిక్షణ పొందిన ఉపాధ్యాయులు నరసింహులు, నిర్మల, అంగన్వాడీ సూపర్‌వైజర్ భాను, లక్ష్మీదేవి జ్ఞాన శిక్షణ ఇస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు. **కలకడ:** అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతిపై శిక్షణ తరగతుల నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి మునీంద్రనాయక్ పేర్కొన్నారు.మండలంలోని స్థానిక ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి కార్యక్రమంపై ఆరు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు ఇస్తున్న పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పిల్లలలో ఉన్న నైపుణ్యాలను పరిశీలించడం వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికితీయడం వారు పాఠశాలకు వెళ్లేందుకు ఇష్టతరమైన కార్యక్రమాలను ఈ శిక్షణా తరగతులలో నేర్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిపిడిపిఒ రమాదేవి, ఎంఇఒ రామచంద్రారెడ్డి, సూపర్వైజర్లు శాంతమ్మ, యశోద, డిఆర్‌పిలు రెడ్డినాగయ్య, అంజద్అలీ, శంకర్‌ప్రసాద్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **సుండుపల్లె:** అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి పై శిక్షణ తరగతుల నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ వెంకటేష్ నాయక్ తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలలో ఉన్న నైపుణ్యాలను పరిశీలించడం, వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికితీయడం, వారు పాఠశాలకు వెళ్లేందుకు ఇష్టతరమైన కార్యక్రమాలను ఈ శిక్షణా తరగతులలో నేర్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ2 రవీంద్రనాయక్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు వెంకట్, లక్ష్మమ్మ, వనిజ విజయలక్ష్మిచ సుశీల, డిఆర్‌పిలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి :ఎఒ

ప్రజాశక్తి-సుండుపల్లి



సుండుపల్లి : యూనిక్ ఐడిని నమోదు చేసుకుంటున్న రైతులు

మండలంలోని విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.మహబూబ్‌బాషా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని సుండుపల్లి, ముడుంపాడు రైతు సేవా కేంద్రాలలో జరుగుతున్న రైతు విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియను పరిశీలించినట్లు తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకం ఉన్న రైతులు అందరూ కూడా వారి పేరు మీద రైతు విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రైతులకు అందించే ఏ పథకం అయినా ఈ రైతు విశిష్ట సంఖ్య ద్వారానే అనుసంధానం చేయడం జరుగుతుందన్నారు. రైతు సేవా కేంద్రాలలో రైతులు తమ భూమి రికార్డులు, 1బి, ఆధార్ కార్డు, సెల్ ఫోన్ నెంబరు తీసుకొని రావలసి ఉంటుంది. ఆన్‌లైన్‌లో గుర్తింపు కార్డు నమోదు ప్రక్రియ పూర్తి చేసుకున్న వారికి త్వరలో గుర్తింపు కార్డులు కూడా జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా, ఆర్‌ఎస్‌కె సిబ్బంది పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** పట్టాదారు పాసుపుస్తకాలు కలిగిన రైతులు వ్యవసాయశాఖ ద్వారా ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రీ అనే పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఎఒ నాగప్రసాద్ రైతులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు 4వేల మందికిపైగా పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకున్నారని వీరికి 11 అంకెలు గల ప్రత్యేక గుర్తింపు సంఖ్య జారీ చేయబడుతుందన్నారు. ఈ గుర్తింపు సంఖ్య ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల కోసం అమలు చేసే వివిధ సంక్షేమ పథకాలు, పీఎం కిసాన్, ప్రభుత్వ రాయితీలు, ఎరువులు, విత్తనాలు, సూక్ష్మసేద్యం, రైతురుణాల మంజూరుకు అనుసంధానం చేయబడుతుందన్నారు. కావున రైతులు తమకు సంబంధించిన 1బి, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా, రేషన్ కార్డు మరియు ఆధార్ అనుసంధానం కలిగిన మొబైల్ ఫోనుతో సహా వారి రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. ఈ రిజిస్ట్రేషన్ కొరకు రైతు స్వయంగా వచ్చి ఆధార్ ఇకెవైసి ద్వారా నమోదు చేసుకోవలసి ఉంటుం దన్నారు. ఈ అవకాశాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మహాశివరాత్రికి పటిష్ట ఏర్పాట్లు : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మహా శివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకొని అన్ని శివాలయాల్లో ప్రతిష్టాత్మకమైన ఏర్పాట్లు చేస్తున్నామని మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మదనపల్లిలోని శ్రీయోగ భోగేశ్వరస్వామి ఆలయం, శ్రీమంజునాథ స్వామి ఆలయం, సోమేశ్వర స్వామి ఆలయం, నీలకంఠ స్వామి ఆలయం, తవళంలో నేలమల్లేశ్వర స్వామి ఆలయం, వేంపల్లి మల్లయ్యకొండ, రామసముద్రంలోని వాళేశ్వర స్వామి ఆలయాల్లో శివరాత్రి పండుగ రోజు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లతో పాటు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత ఎంపిడిఒలను ఆదేశించినట్లు తెలిపారు. శివాలయాలను సందర్శించే భక్తులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించే బాధ్యత ఆలయ కమిటీలు, సంబంధిత అధికారులదేనని అన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం, టిడిపి నాయకులు, ఎమ్మెల్యేగా తాను, ప్రభుత్వ అధికారులు సిద్ధంగా వున్నారని పేర్కొన్నారు. సకాలంలో భక్తులకు సేవలు అందిస్తూ, ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్నిజాగ్రత్తలు తీసుకో వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ప్రమీల, నాయకులు జేసిబి మధుసూదన్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లయ్య కొండను సందర్శించిన అటవీ శాఖ అధికారులు

ప్రజాశక్తి తంబళ్లపల్లి

తంబళ్లపల్లి సమీపంలోని మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి ఆలయాన్ని బుధవారం అటవీశాఖ అధికారులు సందర్శించారు. సబ్ డిఎఫఒ శ్రీనివాసులు, రేంజర్ జయప్రసాద్‌రావులకు పూజారి ఈశ్వరప్ప స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వారు కొండపై జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. భక్తులకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలి పారు. వారి వెంట ఎఫ్‌ఎస్‌ఒ రెడ్డివరాప్రసాద్, ఎఫ్‌బి ఒ రామ్‌రాజ్ పాల్గొన్నారు.

జాతరలో మెరుగైన సౌకర్యాలు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మార్చి 1, 2వ తేదీలలో జరుగనున్న గంగమ్మ జాతర సందర్భంగా ప్రజలకు సౌకర్యాలన్నీ కల్పించాలని రాయచోటి ఆర్‌డిఒ ఎ.శ్రీనివాసులు అధికారులకు సూచించారు. బుధవారం మండలంలోని స్థానిక గంగమ్మ దేవత ఆలయ ప్రాంగణంలో మండల స్థాయి అధికారులు సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారులతో జాతర ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జాతరకు వచ్చే సామాన్య భక్తులకు ఇటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతం చేయాలని సూచించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా అదనపు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. జాతర జరిగే మూడు రోజుల్లో పాటు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఎక్కడికి అక్కడ ఏర్పాట్లు ముందస్తుగా చేపట్టాలన్నారు. శానిటేషన్, మరుగుదొడ్లు స్నానపుగదులు ఏర్పాటు చేసేలా అధికారులు చరోవచూపాలన్నారు. భారీ కెడ్లు ,చలువ పందిళ్ళు ఏర్పాటు చేయాలన్నారు. జాతర మూడు రోజులు ఆర్‌టిసి వారు ప్రత్యేక బస్సులను నడపాలన్నారు. వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు అందు బాటులో ఉండాలన్నారు. దాతల సహకారంతో మంచినీళ్ల ప్యాకెట్లు, వాటర్ బాటిల్లు, మజ్జిగ ప్యాకె ట్లను పంపిణీ చేసెలా దాతలను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ రామాంజనేయులు, ఆలయ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, ట్రాన్స్కో డిఇ ఈ.నాగముని స్వామీ, (కొనంపేట పిహెచ్‌సి వైద్యులు సిద్దయ్య, దేవాదాయ ఇన్స్‌పెక్టర్ శివయ్య, ఇఒపిఆర్‌డి ఉషా రాణి,ఎస్.ఐ.రవీంద్ర బాబు, ఎక్సైజ్ సిఐ.హిమబిందు, ఆర్‌టిసి డిఎం,టిడిపి నాయకులు మధన్ మోహన్,వెంకట్రామరాజు,ఆలయ పూజారులు, చెల్లు గంగరాజు, చంద్ర,రెడ్డి శేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ శ్రీనివాసులు



ఆర్థిక సాయం అందిస్తున్న మానవత సభ్యులు

కేన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

స్థానిక పట్టణంలోని ఆదర్శస్కూల్ వెనుక వడ్డేపల్లిలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బోన్ కేన్సర్‌తో బాధపడుతున్న కె.సోని అనే మహిళను గుర్తించి పది వేల రూపాయలు ఆర్థిక సాయం అందించినట్లు మానవత స్వచ్ఛంద సంస్థ చైర్మన్ కీర్తిపాటి ప్రసాద్‌వర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు చేయడమే తమ లక్ష్యమని అన్నారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ముద్దలూరు చంద్రమోహన్‌రాజు, కోశాధికారి పొన్నూరు నిరంజన్‌బాబు, డైరెక్టర్లు ఎ.శ్రీనివాసులు, కె.బాలకృష్ణంరాజు, ఎస్.మస్తాన్ సాహెబ్, సభ్యులు పి రామకృష్ణ, జి.మనోహర్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.



హిందీ రచయితలు, కవుల చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఘనంగా హిందీ భాషోత్సవం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని టి.కమ్మపల్లి జడ్‌పి హైస్కూల్‌లో బుధవారం హిందీభాషా ఉత్సవాన్ని హిందీ ఉపాధ్యాయుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈనెల 18 నుంచి 21 వరకు భాషోత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందని అందులో భాగంగా బుధవారం హిందీభాషా ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగిందని హిందీ తెలిపారు. హెచ్ఎం కె.బబిత మాట్లాడుతూ హిందీ నేర్చుకోవడానికి చాలా సులభమైన భాష అని హిందీతో భారతదేశంలో ఏ మూలకెళ్ళినా సులభంగా మన పనులు చేసుకో రావచ్చున్నారు. కాబట్టి ప్రతి ఒక్క విద్యార్థి జాతీయ భాష హిందీపై ప్రత్యేక శ్రద్ధ వహించి నేర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు హిందీ కవుల, రచయితల చిత్రాలను చార్ట్‌ల లో గీసి ప్రదర్శించారు. హిందీ బాల్ గీత్ పాడారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



ప్రకృతి వ్యవసాయ కూరగాయాల స్టాల్‌ను ప్రారంభిస్తున్న పవన్

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని హైస్కూల్ ప్రాంగణం ఎదుట ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రకృతి వ్యవసాయకార్యాలయం నుంచి మార్కెటింగ్ పెసిలిటేటర్ పవన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూ టికి నూరు శాతం ప్రకృతి వ్యవసాయంలో పండించిన కూరగాయలు మాత్రమే ఇక్కడ అమ్మడం జరుగుతుందని తెలిపారు. ఈ కూరగాయలు తినడం వల్ల ఆరోగ్యంగా ఉండటంతో పాటు బిపి, షుగర్ వంటి వ్యాధులకు రాకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ స్టాల్లో కూరగాయలు, ఆకు కూరలు, దుంప జాతులు, తీగజాతి కూరగాయలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ స్టాల్ ప్రారంభించడానికి సహకరించిన వారికి అభినందనలు తెలిపారు. కార్యక్ర మంలో మండ లానికి సంబంధించిన డివిజన్ ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ వెంకటరమణ, మోడల్ మేకర్ రామయ్య, మండల యూనిట్ ఇన్‌ఛార్జిలు యశోదమ్మ, నాగరాజు, రమణ, స్వాతి, నాగరాజు, ఐసిఆర్‌పిలు, రైతులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-గాలివీడు : మండలంలోని నూలివీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురు వారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించబడునని ప్రాథమిక వైద్యాధికారి స్రవంతిరెడ్డి పేర్కొన్నారు. శ్రీ సాయి కడప నర్సింగ్ హోమ్ డాక్టర్ మాధవి లత ఆధ్వర్యంలో కంటిలో శుక్లం గల వారికి ఐఒఎల్ మధురై కంటి ఆపరేషన్ ఉచితంగా చేయబడునని తెలిపారు. వైద్య శిబిరానికి హాజరయ్యేవారుఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్ కార్డు ఒరిజినల్ కార్డులతో తప్పక తీసుకొని రావాలని తెలిపారు.

ఎంఇఒలకు సన్మానం

ప్రజాశక్తి-గాలివీడు

విద్యా వ్యవస్థలో విద్యను అభ్యసించిన గురువులను సన్మానించడం విద్యావ్యవస్థకే తల గర్వకారణంమని ఆర్‌ఆర్ కళాశాల ప్రిన్సిపల్ జయ చంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం జరిగిన ఫేర్వెల్‌డే సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులను, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యా యులను ఫేర్వెల్ డే పిలిపించి వారిని దుశ్శాలువా, పూలమాలతో సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఓబుల్‌రెడ్డి, అధ్యాపకులు రాజసుబ్బారెడ్డి, రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్



జైలు శిక్ష పడిన నిందితులతో పోలీసులు

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో నలుగురికి జైలు శిక్ష

ప్రజాశక్తి-కలకడ

డ్రంక్ అండ్‌డ్రైవ్‌లో నలుగురు వ్యక్తులకు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. గతంలో ఎస్ఐ తనిఖీలు నిర్వహించగా డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పట్టుబడిన బాటవారిపల్లి పంచాయతీ చలమయ్యగారిపల్లెకు చెందిన నాగేంద్ర ఎర్రకోటపల్లికి చెందిన సి.బాలాజీ, కోనకు చెందిన సబ్జాన్, గుట్టపల్లి వడ్డేపల్లికి చెందిన వెంకటరమణ లకు వాల్మీకిపురం జ్యుడీషియల్ కోర్టు మెజిస్ట్రేట్ ఫస్ట్ ఆఫ్ కోర్టు జడ్జి గురుఅరవింద్ ఒక్కొక్క నిందితుడికి రూ.16 వేలు జరిమానా విధించి వారం రోజులు పాటు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.